

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఇ.బాలగంగాధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఎఇఇ కె.వి.విజయ కిషోర్, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సుధాకర్ బృందం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో శ్రీవెంకట సత్యనారాయణ ఏజెన్సీస్‌లో రూ.8.56 లక్షల విలువ చేసే 29.75 ఎంటి ఎరువులను, విశ్వేశ్వర ఫర్టిలైజర్స్‌లో రూ.1.75 లక్షల విలువచేసే 7.65 ఎంటి ఎరువులను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయనందువలన ఆ దుకాణాలకు విక్రయాలు నిలిపివేయవలసిందిగా నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీ ధరకు మించి విక్రయించిన, నకిలీ ఎరువులను విక్రయించిన, అనుమతి లేని వాటిని విక్రయించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దుకాణదారులను హెచ్చరించారు.

నిరుపేదలకు భూములు పంచాలి

- ధర్నాలో వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు



నిరసన తెలుపుతున్న పేదలు, వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భూ పంపిణీని ప్రభుత్వం ఒక విధానంగా చేపట్టాలని, భూమి లేని నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పేదలకు భూ పంపిణీ చేయడానికి వేలాది ఎకరాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. దళితులకు చెందిన 300 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను అగ్రకులాల వారు దురాక్రమణ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అసైన్మెంట్ భూములను, చెరువులు, పోరంబోకు భూములు, దురాక్రమణ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గట్టు, శంకరాపురం తదితర గ్రామాల్లో ఉన్న దేవాలయ భూములు భూమిలేని పేదలకు నామ మాత్రపు కౌలుకు ఇవ్వాలని,కౌలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.పేదల స్వాధీనంలో ఉన్న పోరంబోకు, బంజరు భూములకు రెవెన్యూ రికార్డుల పరంగా హక్కులు కల్పించాలని,భూసీలింగ్ చట్టం ప్రకారం పునర్విచారణ చేపట్టి భూ పంపిణికి అదనపు భూములు రాబట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్న, వ్యాపారాన్ని అరికట్టాలన్నారు.కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల ప్రకారం భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని కోరారు. పేదలకు భూ పంపిణీ కోసం ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వీరప్ప, అంజి, ప్రసాద్, గంగాధర్, సరస్వతి, రమణ, రెడ్డయ్య, రమణమ్మ, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయకపోతే గుణపాఠం తప్పదు

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వెలుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రెగ్యులర్ చేయకపోతే వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాయచోటి, రాజంపేట మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబయ్య, రవి శంకర్, చెన్నయ్య. రాంబాబు మాట్లాడారు. 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం 3 దఫాలుగా చర్చించి హెల్త్ అలవెన్స్ జీతంలో కలపి ఇస్తామని ప్రభుత్వం హామీల ఇచ్చిందన్నారు. రెగ్యులర్ చేస్తామన్నా హామీని విస్మరించడం తగదన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు 11 పిఆర్‌సిలో బేసిక్ ఐనా వేతనంగా ఇవ్వాలన్నారు. జనాభాకు అనుగణంగా కార్మికుల సంఖ్య పెంచి ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని తెలిపారు. మాస్కులు, గ్లౌజులు కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వలేదన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, కెవి పీయస్ జిల్లా కో కన్వీనర్ డీసీ వెంకటయ్య మాట్లాడుతూ కనీస వేతనం, కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కనీసం ఇప్పుడయినా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కరించి న్యాయం చేయాలని లేకపోతే ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. పోటీ కార్మికులతో పని చేయించడం మానుకోవాలని తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు అందించే క్రమంలో పోలీసులు సిఐటియు నాయకులను కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. దీంతో పోలీసులను నెట్టుకుంటూ కలెక్టరేట్ లోనికి వెళ్లి సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట, రాయచోటి మున్సిపల్ కార్మికులు లక్ష్మిదేవి, ప్రసాద్, మల్లికార్జున, రమణ, తిరుపాల్, సురేంద్ర, అశోక్, మంగమ్మ పాల్గొన్నారు

'ఉపాధి' పనులు గుర్తించండి : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని అటవీ ప్రాంత పరిధిలో ఉపాధి చట్టం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ డ్వామా, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ నిధులతో అటవీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులపై జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంత పరిధిలో నిబంధనల మేరకు ఉపాధి హామీ పనులను చేపట్టాలన్నారు. నగరవనం, ఫారెస్ట్ ఫైరింగ్ జోన్‌లో నేల తేమ సంరక్షణ, కొత్త అమృత సరోవర్లు, ఊట కుంటలు ఇతర నీటి కుంటలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఇదివరకే అటవీ ప్రాంతంలో ఉన్న చెక్ డ్యాములు పర్కులేషన్ ట్యాంకులలో ఉపాధి హామీ కింద పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అవసరమైన పనులు చేపట్టడానికి అటవీ, డ్వామా శాఖలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను గుర్తించాలన్నారు. మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని పది రోజుల్లోగా పనులను గుర్తించి మంజూరు నిమిత్తం ప్రతిపాదనలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన పనులు, అనుసరించాల్సిన మార్గదర్శకాలను డ్వామా పీడీ మద్దిలేటి సమావేశంలో వివరించారు. సమావేశంలో డిఎఫ్‌ఒలు నాగమనేశ్వరి, వివేక్, సబ్ డిఎఫ్‌ఒలు శుభమ్, శ్రీనివాస్, డ్వామా ఎపిడిలు రవి, నందకుమార్‌రెడ్డి, అటవీ, డ్రామా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బహిరంగ సభ కోసం స్థల పరిశీలన చేస్తున్న టిడిపి నాయకులు

24న చంద్రబాబు సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీలేరు పర్యటన సందర్భంగా జరగనున్న భారీ బహిరంగ సభ కోసం స్థల పరిశీలన చేశారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పార్టీ శ్రేణులు స్థానిక మదనపల్లి రోడ్డులోని ఎపిఐఐసి లేఅవుట్, ఇతర ప్రాంతాల్లో టిడిపి శ్రేణులతో కలిసి సభాస్థలి కోసం తగు ప్రాంతాలను పరిశీలించారు. ఆ క్రమంలోనే హెలిఫ్యాడ్, వాహనాలు నిలుపు స్థలం, వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా స్థానికంగా ఉండే రైతుల్ని, టిడిపి శ్రేణుల్ని అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు చోట్ల స్థల పరిశీలన చేసిన తర్వాత టిడిపి కేంద్ర కార్యాలయం నుండి వచ్చే కమిటీ పర్య వేక్షించాక బహిరంగ సభ ఎక్కడ జరపాలన్నది నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, మండల పార్టీ యువ నాయకులు వసంతాల రాజా, ఎస్సీ సెల్ నాయకులు సుభాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిఐగా మహబూబ్ బాషా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రథమ సిఐగా షేక్ మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడప రాదని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు.ఈయన గతంలో మదనపల్లె వన్‌టౌన్ సిఐ గానూ, కడపలో, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ)హైదరాబాద్ లోనూ, ఎపి ఇంటిలిజెన్స్ హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఆయన పని చేసినట్లు తెలియజేశారు.



జెసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కొనసాగుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం ఎదురుగా మానవహారం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నాడు-నేడు నుంచి పిల్లలకు చదువులకు అవసరమయ్యే అమ్మబడి,జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, యూ డైస్ తదితర వాటిని ఎప్పటి కప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలో విధులను పూర్తి చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్‌తో కూడిన గ్రాటివిటీ కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ కార్డు సదుపాయాన్ని కల్పించాలని, పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వయ్య, పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు,మరియు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి వారి సంఘీభావం తెలియజేశారు.

11న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాయచోటి

కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 11న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్ ప్లస్ ఫార్మసీలో ఫార్మసిస్టులుగా పని చేయడానికి, డిక్సన్ టెక్నాలజీస్ కంపెనీలో అసెంబ్లీ లైన్ ఆపరేటర్‌గా పని చేయడానికి ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డి. ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, విద్యార్హతలు కల్గిన 19 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.11,076 నుంచి 18 వేల వరకు హోదాను బట్టి జీతం ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల మహిళా, పురుష అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువ పత్రాలు, ఫొటోలు తీసుకుని ఈనెల 11న ఉదయం 9 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.



పోర్లు దండాలతో నిరసన

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తూనే కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. ఎస్మా ప్రయోగ జిఒ ప్రతులను దహనం చేస్తూ, రహదారులపై రాస్తారోకో, వర్షం కురుస్తుంటే గొడుగులతో తమ నిరసనను తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

- వర్షంలోనూ గొడుగులతో వినూత్న నిరసన
- ఎస్మా జిఒ ప్రతులు దహనం
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- 28వ రోజూ కొనసాగిన సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు



రైల్వేకోడూరు : వర్షంలోనూ గొడుగులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకున్నారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మిదేవి అధ్యక్షన కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నారు. మదనపల్లి, నిమ్మనపల్లికి చెందిన 15 మంది అంగన్వాడీలు నిరాహారదీక్షలో కూర్చున్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సి.రామచంద్ర, కెవిపిఎస్ జిల్లా కోకన్వీనర్ డిసి.వెంకటయ్య దీక్షలను ప్రారంభించారు. ఒపిడిఆర్ రాష్ట్ర సహాయక కార్యదర్శి టి.ఈశ్వర్ అంగన్వాడీల పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సంఘీభావం తెలిపారు. అనేక విప్లవ గీతాలతో నృత్యాలు డప్పు మోతల్లతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట కడప-చిత్తూరు జాతీయ రహదారిపై అంగన్వాడీ వర్కర్లు భారీ సంఖ్యలో పడుకుని జోరువానలో పొర్లు దండాలతో ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఒక వైపు సమస్యల పరిష్కారానికి చర్చలు జరుపుతూ మరో వైపు సిడిపిఒలతో సమ్మె విచ్ఛిన్న చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని జిఒలు తెచ్చినా లెక్కచేయమని, ఎంతటి నిరబంధాలనైనా తీవ్ర ప్రతిఘటనతో ఎదుర్కొంటామని తెలిపారు. సమ్మె విరమించు ప్రసక్తే లేదని జీతాల పెరుగుదల సాధన తమ లక్ష్యమని గట్టిగా నొక్కి చెప్పారు. కార్యక్రమంలో రాయచోటి సంబేపల్లి, చిన్నమండెం, మదనపల్లి, నిమ్మనపల్లి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **కలకడ:** అంగన్వాడీలు వర్షంలోనూ గొడుగులతో మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ ధర్నా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్‌వాడీ కార్మికుల సమ్మెను నిషేధిస్తూ జారీ చేసిన ఎస్మా జిఒ ప్రతులను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. జ్యోతిచౌక్‌లో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరప్ప, అంజి, రమణ, రెడ్డెప్ప, గణేష్, గంగాధర్ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, సిపిఎం మండల కార్యదర్శి లింగాల యానాదయ్య, పి.జాన్ ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ఎస్.శ్రీలక్ష్మి, ప్రాజెక్టు, గౌరవ అధ్యక్షులు, వనజ కుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధాకుమారి, కోశాధికారి, జి.పద్మావతి, వెన్నెల, దుర్గ, శిరీష, లీలావతి, కుమారి, ఈశ్వరమ్మ, వాణి, సుజాత, సునీత, రోజా, ప్రసన్న, రైతు సంఘ నాయకులు, శివ వర్మ, అడ్వకేట్ కృష్ణ పాల్గొన్నారు. వర్షాన్ని లెక్కచేయకుండా గొడుగులతోనే నిరసన తెలియజేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మాను వాపసు తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షులు సుకుమారి పేర్కొన్నారు ఐసిడిఎస్ కార్యాలయం నిర్వహించిన సమ్మెలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, సెక్టార్ లీడర్లు, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, మండలాలకు చెందిన అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** బూదలవాండ్లపల్లి సమీపంలో మూడు రోడ్ల వద్ద వర్షంలో గొడుగులు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ ఎం.గౌరీ, బి.కరుణ, సులోచన, సుభద్ర, సుజాత, శివమ్మ, సరస్వతి, ప్రమీల పాల్గొన్నారు.



కలకడ : వర్షంలోనూ గొడుగులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

దుస్తులు పంపిణీ ఆదర్శనీయం : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఏడాదీ సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేయడం ఆదర్శనీయం అని డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని సుద్దలవండ్లపల్లి రోడ్డులో ఉన్న మణికంఠ గిరిపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రాయచోటి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 10 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 260 మంది పేద విద్యార్థులకు అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డిఇఒ శ్రీరాం పురుషోత్తంతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్ కుమార్, పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, ఎంఇఒ బాలాజీ నాయక్ హాజరయ్యారు. పేద పిల్లలకు బట్టలు పంపిణీ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్ప సేవా సొసైటీ వారు భక్తి మార్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టడమేగాక ఇలా ప్రతి ఏడాది పేద పిల్లలకు సంక్రాంతి పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు దుస్తులు ఇవ్వడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యను ప్రోత్సహించే విధంగా భవిష్యత్తులో అయ్యప్ప సేవా సొసైటీ వారు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరిలో సేవాభావం కలగాలని, దాతలు అందించిన ప్రోత్సాహకాన్ని విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి అయ్యప్ప సేవా సొసైటీ లాగానే చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షులు బసిరెడ్డి, సభ్యులు డాక్టర్ రెడ్డన్న, కొండూరు మురళీమోహన్ రాజు, మల్లన్న, అనిల్, మణికంఠ, సురేష్, రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థికి దుస్తులు అందజేస్తున్న డిఇఒ పురుషోత్తం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలి రావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 19న విజయవాడలో నిర్వహించే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బడుగు బలహీన వర్గాలు తరలి రావాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బడుగు, బలహీన వర్గాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను అయన ఆవిష్కరించారు. భావితరాలకు స్ఫూర్తిగా విజయవాడలో సుమారు రూ 400 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా జన్‌భగీదరి పేరుతో నిర్వహించనున్న కార్యక్రమంలో దళితులు, దళిత సంఘాలు, బలహీన, మైనారిటీలు తరలి రావాలన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు కాలపరితిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనహాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తిచెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దేవేంద్రకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

క్రీడాకారునికి రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

మండలం లోని నల్లగుట్టపల్లె పంచాయతీ బిసి కాలనీకి చెందిన దేవేంద్ర త్వరలో ఢిల్లీలో జరిగే ప్రపంచ స్థాయి షూటింగ్‌బాల్ టోర్నమెంట్‌కి ఇండియా తరఫున ఎంపికయ్యారు. స్థానిక నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి కలిసి దేవేంద్ర ఆర్థిక పరిస్థితులు వివరించగా దేవేంద్రకు ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో ప్రపంచ కప్‌కు ఇండియా తరఫున సెలెక్ట్ అవ్వడం నియోజకవర్గ ప్రజలకు హర్షం చదగ్గ విషయమన్నారు. ఈ టోర్నమెంట్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఇండియాకి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో శివారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమితికి రూ.25 వేలు విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప నగరంలో ఈనెల 9వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ సమితి జాతీయ చతుర్థ మహాసభకు కమిటీ సభ్యుల కోరిక మేరకు తమ వంతు విరాళంగా జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు సోమవారం రూ.25 వేలు విరాళాన్ని ఉపాధ్యాయ సమితి జాతీయ ఆర్థిక కార్యదర్శి సమ్మెట శేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ భావి తరాల విద్యార్థుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు తనవంతు సహకారం అందజేసేందుకు ముందుంటానని తెలిపారు. కమిటీ సభ్యులు కరవ చంద్రశేఖర్, చామల సురేంద్ర, వేంకటరామ, ప్రసాదరెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీహరిరావు, సల్ల వెంకటసుబ్బారెడ్డి శ్రీనివాసరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేవరకొండ పురుషోత్తం మనవడు ప్రసన్న కుమార్, సుష్మా దంపతుల కుమారుడు హేమన్స్ కుమార్ జన్మదినం సందర్భంగా బండపల్లి పంచాయతీ ప్రేమాలయం ఆశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారని ప్రేమాలయం వ్యవస్థాపక అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం అన్నదాత దేవరకొండ పురుషోత్తం మాట్లాడుతూ నా మనవడు హేమన్స్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. రాబోయే రోజులలో పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బడిమెల మురళీకృష్ణ, బడిమెల రవీంద్ర, బడిమెల నరసింహులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని కదిరాయచెరువుకు చెందిన సందీప్ కుమార్‌కు కొండిస్ట ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ను అందజేసింది. గుంటూరులో జరిగిన కొండిస్ట ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బివి నారాయణ రూ.5,116, ప్రశంసాపత్రంను అందచేశారు. ప్రస్తుతం విద్యార్థి ఐఐటి శ్రీకాకుళంలో పియుసి 2వ సంవత్సరం చదువుకుంటున్నాడు. స్కాలర్‌షిప్ రావడంతో తల్లిదండ్రులు, బంధువులు, అన్నదమ్ములు, తమ సంతోషం వ్యక్తం చేసినట్టు తెలిపారు.



ఉపకార వేతనం అందుకుంటున్న సందీప్

'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వం చేపట్టిన ఆడదాం ఆంధ్ర పాటల పోటీల్లో మండల స్థాయిలో ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని ఎంపి డిఒ సురేంద్రనాథ్ తెలిపారు. ఆటల పోటీల నిర్వహణపై సోమవారం ఎంపి డిఒ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల స్థాయిలో జరిగిన పోటీలలో ప్రతిభ చాటిన వారికి మండల స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఆటల పోటీల నిర్వహణ విషయమై పీడీ మొగల్ ఖాదర్‌బాష, పిఇటిలు లత, దేశ్ ముఖ్ చలపతి రెడ్డి,లతో చర్చించారు. ఆటల పోటీలను విజయవంతం చేయాలని సూచించారు.

పాఠశాలల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి తంబళ్లపల్లి

మండలంలోని ఉన్నత పాఠశాలలు కస్తూర్బా, మోడల్ స్కూల్‌లలో సోమవారం బాలికలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల సజ్జ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నిరుపమా, స్వరూప్య, దీపిక, దివ్యశ్రీలు వేసిన ఆకర్షణీయమైన ముగ్గులు ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.వి.కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పిల్లలకు భోగి పండ్లు వేయడం, హరిదాసు, సోది చెప్పేవారు, అమ్మవారు, రైతు, గంగురెద్దుల వారు వివిధ వేషధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు. గొబ్బెమ్మ పాటలకు పిల్లలు వేసిన నృత్యాలు అలరించాయి. చివరిగా భోగి మంటలను వేసి గాలిపటాలను ఎగరవేశారు. కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ విజయలక్ష్మి, హెడ్మాస్టర్ రాహుల్, స్నేహలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు మెహిదీన్ దుర్గేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణం చుట్టూ మామిడి తోరణాలు కాంపౌండ్ పరిధిలో విద్యార్థులు ముగ్గుల వేసి గాలిపటాలు ఎగరవేశారు. పాలు పొంగ బెట్టడం ఉట్టి కొట్టడం భోగి మంటలు ఇలా అన్ని కలవేసుకుని సెలవు దినాల్లో పల్లెలలో ఇంటి వద్ద ఇంత సంతోషంగా జరుపుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతంపల్లి, శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో అనంతంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బలక్షుమ్మ, పద్మనాభం, గంజి నరసింహులు, రవీంద్రబాబు, రాధా, వాసు, సురేష్, సరళ, సుధాకర్, ఈశ్వరయ్య, రవికుమార్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక రాజు విద్యాసంస్థల పాఠశాల సిఇఒ రఘురామరాజు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో చిన్నారులు

మూసిన పాఠశాలను తెరిపించరూ...!

- 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళుతున్న చిన్నారులు
- తల్లిదండ్రుల్లో ఆందోళన
- పాఠశాలను మళ్లీ తెరవాలని అభ్యర్థన

ప్రజాశక్తి-మదనపల్లె

ఒక్కప్పుడు విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరవేసిన బడి నేడు మూత పడి పాములకు, పక్షులకు, వ్యవసాయ పనిముట్లకు నిలయంగా మారింది. ఇదే స్కూల్‌లో చదవిని ఎంతో మంది విద్యార్థులు నేడు వివిధ రంగాలలో ఉన్న స్థానాల్లో ఉన్నారు. ఎంతో మందిని ఉన్నత స్థానాలకు చేరవేసిన ఈ పాఠశాల ప్రస్తుతం మూత పడడంతో స్థానిక చిన్నారులు 4 కిలోమీటర్లు దూరంలో ఉన్న పాఠశాలకు కాలినడన పోవాల్సి వస్తున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు...కురబలకోట మండలం పిచ్చల వాండ్లపల్లి పంచాయతీ నలసానివారిపల్లె (లక్కసముద్రం)లో 1982లో మూడు పల్లెలైన తంగేళ్ళవారిపల్లె, నలసానివారిపల్లె, ఎనుబోతులవారిపల్లెకు కలిపి మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. అప్పటి నుండి అక్కడికి ఒక్క ఉపాధ్యాయుడు వెల్లి విద్యా భోధన చేసేవారు. కాలక్రమేన విద్యార్థులు సంఖ్య క్రమంగా పెరుగు తుండడంతో ప్రభుత్వం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి 2001-2009 వరకు విద్యాభోదన చేయించారు. అక్కడ ఉపాధ్యాయులు జి.వి.ప్రసాద్, ఎన్.రమాదేవిలు విద్యార్థులు నాణ్యమైన విద్యను అందిస్తు డడంతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ, ఆటలు పోటీలు నిర్వహించి వారిని ఎంతో ప్రోత్సహించారు. అందువలన విద్యార్థులు 10వ తరగతిలో బాగా చదివి 10వతరగతిలో మంచి ప్రతిభ కనబరిచి ఇడుపులపాయ ఐఐఐటిలో కూడా సీట్లు సంపాధించి ప్రస్తుతం ఉన్న రంగాలలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. అయితే 9 సంవత్సరాలు పని చేసిన ఇద్దరు ఉపాధ్యాయులు జి.వి.ప్రసాద్, ఎన్.రమాదేవిలు ఒకే సారి బది కావడతంతో తరువాత వచ్చిన ఉపాధ్యాయుడు పాఠశాల బాగోగుల, విద్యార్థుల భవిష్యత్తు గురించి పట్టించ్చుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విధిలేక తమ పిల్లలను దూరం లోని పాఠశాలలో చేర్పించారు. మరి కొందరు బడి మానేసి వ్యవసాయ పనులుచేసుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపో వడంతో ప్రభుత్వం 2013లో పాఠశాలను మూసివేసింది. 3 పల్లెకు ఉన్న పాఠశాలను మళ్లీ తెరిచి తమ పిల్లల భవిష్యత్తులకు బంగారు బాటలు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మూతపడిన నలసానివారిపల్లె పాఠశాల

పాఠశాలను తెరిపించండి



మా ఊర్లో ఉన్న పాఠశాలను మూసివేడంతో పిల్లలను 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పంపిచాల్సి వస్తోంది. ఉదయం చిన్నారులు కాలినడకన పోతున్నారని, చుట్టు పక్కల అంతా అడివి మార్గం కాబట్టి చిన్నారులు ఇంటికి వచ్చే వరకు భయంగానే ఉంటుంది. మా ఊర్లో ఉన్న పాఠశాలను తెరిస్తే మాకు మేలు చేసినవాళ్ళు అవుతారు.

- చిటికి ఉత్తమరెడ్డి, నలసానివారిపల్లె.

విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందించండి



గ్రామస్థులు, విద్యావంతులు, మండల ప్రజాప్రతినిదులు సహకాంతో ఈ పాఠశాలను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్ది వారికి గుణాత్మకమైన విద్యను అందించాం. ప్రస్తుతం అనివార్య కారణాల వల్ల ఈ పాఠశాలను మూసివేశారు. ఇదే పాఠశాలను పున:ప్రారంభించి స్థానిక విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందిస్తే బాగుటుంది.

- జి.వి.ప్రసాద్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం : 'చమర్తి'



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత టిడిపి ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీ ద్వారాను, ఉచితంగాను ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, అలసందలు, పెసలు, మినుములు వంటివి ప్రతి రైతుకు అందించేవారని, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వంలో ఆపరిస్థితి కనుమరుగైపోయిందని, ఈ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి అప్పటి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారాను, ఉచితంగాను సూక్ష్మధాతువు ఎరువులు, జింకు, బోరాను, జిప్సం వంటివి అందేవని, ప్రస్తుతం ఆ పరిస్థితిలేదన్నారు. ఉద్యాన పంటల సాగు, రైతుల పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వంలో దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో మామిడి తోటలలో పునరుద్ధరణ, కలుపుతీతలో భాగంగా ఉద్యాన రైతులకు ఒక హెక్టార్‌కు రూ.17 వేలు చొప్పున నగదును జమ చేయడంతో పాటు రైతులకు కావాల్సిన కత్తెరలు, రంపాలు వంటివి అందజేసామని, వైసిపి ప్రభుత్వంలో రైతు ఎంత మొరపెట్టుకున్నా ఆ స్కీములు లేకుండా చేసిన ప్రభుత్వం ప్రస్తుత వైసిపి ప్రభుత్వేమన్నారు. గత ప్రభుత్వాలలో గ్రామ యూనిట్ ఆధారంగా రైతుకు ఇన్సూరెన్స్ అందజేశామని, ప్రస్తుతం వాతావరణ బీమా ద్వారా రైతుకు పూర్తిస్థాయిలో నష్టం తప్ప లాభం లేదన్నారు. యువత భవితను చీకట్లోకి నెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనిని ,వైసిపి పాలనలో ప్రధాన బాధితులు యువతే నన్నారు. ఒక డీఎస్సీ కూడా నిర్వహించిన పాపాన పోలేదన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు తెస్తే ఈ ప్రభుత్వంలో గంజాయి మాఫియాను జగన్మోహన్ రెడ్డి తెచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇస్తే జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి వాలంటీర్ ఉద్యోగాలు, చికెన్, మటన్ మార్ట్ ఉద్యోగాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు మొండెం కరీముల్లా, నాగేంద్ర పాల్గొన్నారు. **రాయచోటి :** వర్షాలు సరిగా కురవక పోవడంతో అన్నదాతలకు ప్రత్యామ్నాయంగా ఇతర చర్యలు చేపట్టలేదని, రైతులను ప్రభుత్వం నట్టేట ముంచిందిని మాజీ ఎమ్మెల్యే అర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం దోచుకో దాచుకో అన్న చందంగా తయారైందిన్నారు. టిడ్కో ఇళ్లకు రంగులేసింది తామే అని అంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మాజీ జడ్‌పిటిసి నరసా రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు బొనమల ఖాదర్ వలీ, మార్కెట్ మాజీ చైర్మన్ కలాడి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** జగన్మోహన్‌రెడ్డి పాలనలో రైతుకు ఉరి తాళ్లు మాత్రమే మిగిలాయని, ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా బలిగొన్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖను మూసి వేశారని, ఉద్యాన శాఖ రైతు రోడ్డున పడ్డారని, ధాన్యం రైతు దగాపడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కాజానిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు అబుబకర్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, కొండయ్య నాయుడు, జ్యోతి శివ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** రాష్ట్ర అభివృద్ధికి సంపద సృష్టించగల విజన్ ఉన్న నాయకుడు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ పాలనలో ప్రధాన బాధితులు యువత, మన బిడ్డల జీవితాలు చీకట్లోకి నెట్టేశాడన్నారు. సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ప్రముఖ న్యాయవాది రెడ్డయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌదరి, మండల అధ్యక్షులు కొమ్మ శివ, మాజీ సర్పంచ్ ముక్కర శంకరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'మేడా'

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లేశ్వరి అధ్యక్షతన ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఎన్నో పథకాలు పెట్టి ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. వైయస్సార్ పెన్షన్ కనుక రూ.3000లు పెంచడం అవ్వ తాతలకు, చాలా సంతోషంగా ఉందన్నారు. లంచాలకు తావు లేకుండా వాలంటరీ వ్యవస్థ ద్వారా 1వ తారీకు ఉదయాన్నే ఇంటి తలుపు తట్టి అవ్వదాతలకు పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగన్నా తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. ప్రజలను ఉద్దేశించి జగనన్న వచ్చినప్పటినుండి ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చడమే కాకుండా చెప్పినవి కూడా చేస్తున్నారన్నారు. నూతన సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి అవసరాన్ని ప్రజల ముంగిటకే తెచ్చామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వీర నాగిరెడ్డి, విఆర్ విద్యాసంస్థల అధినేత విఆర్ రెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెసిసి నరేష్ స్వామి, కన్వీనర్లు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీ పాత హరిజనవాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని, ప్రజల సంక్షేమం కొరకు ఆరు గ్యారెంటీ తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెంది తద్వారా రాష్ట్రం కూడా అభివ ృద్ధి చెందే దానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నవరత్నాలు పేరిట రాష్ట్రానికి, ప్రజలకు తీవ్ర మోసం చేసిందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం మరికుంట పల్లి సర్పంచ్ రెడ్డి రామ్, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నీలవాండ్ల పల్లి, పిచ్చికుంట్ల పల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా ఓటరు నమోదు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నీలావాండ్లపల్లి, పిచ్చికుంట్లపల్లిలో గ్రామ వీధుల వెంట ఓటరు నమోదు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు వై.చంద్ర శేఖర్, భాస్కర్, ప్రసాద్, రమేష్, రామ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'జన్ భాగీ దారి' పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో జన్‌భాగీ దారి కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎంపిడిఒలతో జన్ భాగీ దారి, ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్ భాగీ దారి కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి సచివాలయంలో కనీసం ఐదుగురు సిటిజన్‌లను రిజిస్ట్రేషన్ చేయించి జనవరి 19వ తేదీన విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై వ్యాసరచన పోటీలు, పెయింటింగ్స్, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలు ప్రతి సచివాలయం పరిధిలోని మండల, డివిజన్, జిల్లా స్థాయిలో రోజూ ఒక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 9, 10 తేదీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలన్నారు. 11న సచివాలయాలలో సిగ్నేచర్ బోర్డు ఏర్పాటు చేసి సిటిజెన్స్‌తో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. 12న ప్రజల నుంచి సేకరించిన సంతకాలను జి ఎస్ బ్ల్యూఎస్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. 17, 18 తేదీలలో అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో జిల్లా కేంద్రాలలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రజా ప్రతినిధులతో పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రతి మండలంలో ఒక షెడ్యూల్ ప్రకారం తప్పక నిర్వహించాల న్నారు. కార్యక్రమంలో డిఇఒ పురుషోత్తం, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిఎస్‌డబ్ల్యుఎస్ ఎఒ మనోహర్ రాజు, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డిడి జాకీర్ హుస్సేన్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

మసీదులు, దర్గాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గంలో మసీదులు, దర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన మజీద్ ఈ ఖదీర్ మసీదును సోమవారం ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి, శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. నూతన మసీదుల నిర్మాణం, పాత మసీదుల మరమ్మతులకు రూ.కోట్ల మంజూరు చేశామన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో నూతన మసీదుల నిర్మాణంతోపాటు, పురాతన మసీదులు మరమ్మతులు చేపట్టామన్నారు. మజీద్ ఈ ఖదీర్ మసీదును ఎంతో అద్భుతంగా నిర్మించారని కితాబునిచ్చారు. ముస్లింల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ అహ్మద్, జామియా మస్జీద్ ముత్వల్లి పాగొండ ఇస్మాయిల్ సాబ్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, ఒకటో సచివాలయం కన్వీనర్ గుమ్మడికాయల చాంద్ భాషా,షఫీ, ఆదాం, సలీం,సిఆర్ చిన్నికృష్ణ, జాఫర్ భాషా, షేక్ ముజీర్, బసిరెడ్డి, అభిలాష్ రెడ్డి, సాయి ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



డ్రైయినేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

డ్రైయినేజీ సమస్య పరిష్కారానికి కృషి : కమిషనర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నగర పంచాయతీలో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆర్ఐ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌తో కలిసి పట్టణంలోని జై భీమ్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలోని ప్రధాన సమస్య డ్రెయినేజీలపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల మరమ్మతులు,అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుకు తొలి ప్రాధాన్యతమస్తున్నామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నగర పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునన్నారు. బి.కొత్తకోట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ప్రజలను సైతం భాగస్వాములు చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సందీప్ నాలుగో సచివాలయం ఇంజినీర్ రాజశేఖర్, నగర పంచాయతీ సిబ్బంది మోహన, అంజి సిబ్బంది పాల్గొన్నారు.



జెసిబితో కూల్చుతున్న అక్రమ కట్టడాలు

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల కేంద్రంలోని చిట్వేల్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను సోమవారం తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో జెసిబితో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కడప-చెన్నై జాతీయ రహదారి నుంచి చిట్వేల్ వెళ్లడానికి అనువుగా రోడ్డు వెడల్పు మరమ్మతులలో కారణంగానే రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేశామని పేర్కొన్నారు. కోర్టు అనుమతి ఉన్నందున ఇన్ని రోజులు కూల్చివేయడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో అక్రమ కట్టడాలని కూల్చివేశామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్వహిస్తే సహించబోమని తెలియజేశారు. స్థానిక ఎస్ఐ రఘురాం ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, సోము శేఖర్ రెడ్డి, నవీన్, శీను, రవి పాల్గొన్నారు.

'జగన్ పథకాలతో సామాజిక విప్లవం'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చాయని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర, వికసిత్ భారత్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యా, వైద్య రంగాల్లో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టి విప్లవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డిలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరువ అయ్యేందుకు అధికారులు, సచివాలయ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకొచ్చామన్నారు. ఎంపిడిఒ డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎంఇఒ-1లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. అలాగే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమ నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 పద్మావతమ్మ, ఇఒపిఆర్‌డి జయమ్మ, సూపరింటెండెంట్ సతీష్ కుమార్, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామ కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బండ్లపై గ్రామం సమీపంలో దొరబాబుఅనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు నాటు సారా విక్రయ స్థావరంపై పోలీసులు దాడి చేసి దొరబాబును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసార తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.